క్లుప్తంగా

రేపు గంగూరుకు గవర్నర్ రాక

పెనమలూరు: ఈ నెల 3వ తేదీన గంగూరులోని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సందర్శించనున్నారు. ఈ మేరకు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి సోమవారం వివరాలు తెలిపారు. ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఇజ్రాయిల్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన డ్రోన్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉదయం 10.40 గంటలకు ప్రారంభిస్తారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, జేఎన్‌టీయు వైస్‌చాన్సలర్ డాక్టర్ జీవీఆర్.ప్రసాదరాజు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. దేవాలయంలో కార్యక్రమాల వివరాలను ఈవో సుబ్బారెడ్డి వివరించారు. ఈ నెల 3న ఉదయం 8 గంటలకు ఆ్వమివార్లను పెండ్లి కుమారుడిని చేస్తారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేన పూజ, దీపారాధన, ధ్వజ పటప్రతిష్ట, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. 4న ఉదయం నిత్యహోమం, కృష్ణ భక్త భజన మండలిచే పారాయణం, సాయంత్రం 6 గంటలకు నవ కుంభారోహణ, రాత్రి 7.30 గంటలకు శ్రీవారి దివ్య తిరుకల్యాణ మహోత్సవం భక్తుల సమక్షంలో నిర్వహిస్తారు. 5న ఉదయం 7 గంటలకు గ్రామోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి పవళింపు సేవ ఉంటుందని ఈవో తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్‌లో రాజస్తాన్‌కు చెందిన దళపతి సింగ్ కానూరు మురళీనగర్‌లో టీ వ్యాపారం చేస్తాడు. అతను మన్యం ప్రాంతం నుంచి గంజాయి తీసుకు వచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పింఛనుదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి

ఉయ్యూరు: పింఛనుదారులందరూ ఈనెల 10వ తేదీ లోగా ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఉయ్యూరు ఉపఖజానా అధికారి ఏ.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ సమర్పించని పింఛనుదారులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హెర్బ్ యాప్ సహాయంతో కానీ ఉప ఖజానా కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి కానీ సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబరుతో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. పింఛనుకు సంబంధించిన ప్రభుత్వ లావాదేవీలను సరిచూసుకునేందుకు ఈ-కేవైసీ దోహదపడుతుందని చెప్పారు.

రహదారులు జలమయం



ఉయ్యూరు: కుండపోతగా కురుస్తున్న అకాల వర్షం, ఈదురుగాలులతో జనజీవనం స్తంభించింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆదివారం వేకువజాము నుంచి నాలుగు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. రహదారులు జలమయంగా మారాయి. జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్డు, అండర్ పాస్‌లు చెరువులను తలపించటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సమస్య తలెత్తింది. అధికారులు విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

మానసిక వికాస కేంద్రానికి సాయం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో స్పందన మానసిక వికాస కేంద్రానికి తోట్లవల్లూరు మండలం రొయ్యూరుకు చెందిన సామాజికవేత్త సూరి పవన్‌కుమార్ రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం కేంద్రం నిర్వాహకులు సంకాబత్తుల వెంకట్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ..ఎటువంటి లాభాపేక్ష లేకుండా దివ్యాంగులైన పిల్లలకు ఉచిత విద్య, వైద్యం, రవాణా, భోజన సదుపాయలు కల్పించడం అభినందనీయమన్నారు. బైరి రంజిత్, తుల్లిమిల్లి చెన్నారావు పాల్గొన్నారు.

అరుణ పతాక రెపరెపలు



యనమలకుదురులో మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి కార్యదర్శి కాశిం



హనుమాన్‌జంక్షన్‌లో జెండాకు వందనం చేస్తున్న కార్మిక సంఘ నేతలు

- పలు చోట్ల ఘనంగా మేడే
- జెండాలను ఎగురవేసిన కార్మిక సంఘాల నేతలు

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో మే డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో వాడవాడలా ఎర్రజెండాను ఎగురవేసి మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యనమలకుదురులో ప్రజానాట్య మండలి కార్యదర్శి షేక్ కాశిం ఆధ్వర్యంలో గ్రామంలో పలు చోట్ల మేడు జెండాను ఎగురవేశారు. కార్మికులు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అలంభిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణను కార్మికులు తిప్పికొట్టాలన్నారు. కార్మిక నేతలు మాధవ, షేక్ ఇబ్రహీం, ఎస్‌కే బాబు, పల్లా పాపారావు, వాటపల్లి శ్రీరాములు, పలువురు పాల్గొన్నారు. తాడిగడప సెంటర్, పోరంకి, పెనమలూరు ప్రాంతాల్లో మేడే వేడుకలు వివిధ రంగాల కార్మికులు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని హనుమాన్‌జంక్షన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం, జంక్షన్ ప్రధాన కూడలి, ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్, పెరికీడు వంతెన, కానుమోలు, బండారుగూడెం గ్రామాల్లో మేడే సందర్భంగా కార్మిక జెండాను ఎగురవేశారు. స్థానిక ప్రధాన కూడలి వద్ద నిర్వహించిన మేడే వేడుకల్లో సీపీఎం, సీఐటీయూ మండల కార్యదర్శులు బేతా శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని కాలరాసేందుకు పాలకులు చేస్తున్న యత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రధాన రహదారుల్లో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం, ప్రైవేట్ ఎలక్ట్రికల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్, పౌల్ట్రీ ముఠా వర్కర్స్ యూనియన్, ఇసుక ముఠా వర్కర్స్ యూనియన్, పెయింటర్స్ యూనియన్, ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా మేడే వేడుకలు జరిగాయి. సీఐటీయూ నాయకులు జజ్జువరపు ఏసుపాదం, అబ్దుల్ బారీ, బర్రె లెనిన్, ఎత్తుల రాము, రాజనాల సురేష్, వడ్డి గిరి, సీతారామయ్య పాల్గొన్నారు.



దివ్యాంగులకు భోజనం వడ్డిస్తున్న కార్మిక నాయకుడు చంద్రశేఖర్



దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ప్రజాప్రతినిధులు

మానవత ఆధ్వర్యంలో..

స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిస్ట్ యోధుడు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే పుచ్చలపల్లి సుందరయ్య జయంతి, ప్రపంచ కార్మికుల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి మానవత సభ్యులు నివాళి అర్పించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సీనియర్ సభ్యులు గంటా సత్యనారాయణ, నారగాని కొండలరావు, పొట్లూరి శేషాచలం, అక్కినేని రాఘవేంద్ర రావు, వడ్డి రాజేశ్వరరావు, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఉయ్యూరు: మేడే సందర్భంగా మానికొండ భవనం వద్ద కార్మిక పతాకాన్ని సోమవారం సీపీఎం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ఆవిష్కరించారు. విద్యుత్ కార్మికులు పట్టణంలోని సెయింట్ లూకాస్ అనాథ పాఠశాలలో మేడే నిర్వహించారు. అనాథలు, దివ్యాంగులకు భోజనం వడ్డించి మేడే శుభాకాంక్షలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు అడపాక రాంబాబు కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

కంకిపాడు: మండలంలో సీపీఎం, సీపీఐ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంకిపాడు, ఉప్పలూరు, క్రిస్టియన్‌పేట, కుందేరు,జగన్నాధపురం, ప్రొద్దుటూరు, గొడవర్రు, మద్దూరు గ్రామాల్లో కార్మిక పతాకావిష్కరణలు జరిగాయి. సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు, నాయకులు తాడంకి నరేష్, ఏ.ఉషారాణి, జి.కుమారి, సీహెచ్ శ్రీహరి, వి.మరియదాసు, పీతా నాగేశ్వరరావు, సీహెచ్‌వీ రెడ్డయ్య, ఈడా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గన్నవరం: గన్నవరం ప్రాంతంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గన్నవరం, దావాజిగూడెం, అల్లాపురం, బుద్ధవరం గ్రామాల్లో ఎర్రజెండాలను ఎగురవేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 70 మంది పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచి నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. బాలకృష్ణమూర్తి, వీ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: కార్మిక వర్గ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. పట్టణంలో పనిచేస్తున్న 70 మంది పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. బాకీ బాబు మాట్లాడుతూ కార్మిక వర్గ అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ విధానాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, నాయకులు బాకీ రాజు, షేక్ అహ్మద్, లీలా దండుగల రవి, కంకిపాటి రమేష్, కె.వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆయా గ్రామాల్లోని అర్హుల ఇంటింటికి వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సోమవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడులో మొత్తం 96 శాతం, ఎనికేపాడులో 94 శాతం, ప్రసాదంపాడులో 93 శాతం, నిడమానూరులో 92 శాతం పంపిణీ చేశారు. తొలి రోజు అన్ని గ్రామాల్లో 94 శాతానికి పైగా పంపిణీ పూర్తి చేశారు.

హాస్పిటల్‌కు వెళ్లి పింఛను అందజేత

విజయవాడ రూరల్ మండలం నిడమానూరు రామానగర్‌కు చెందిన తులుగు రంగారావు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. చినఅవుటపల్లిలోని పిన్నమనేని మాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ పెనుమాక రాజేష్ హాస్పిటల్‌కు వెళ్లి పింఛను అందజేశాడు.

ఉదయానే తలుపుతట్టిన పింఛన్

పెనమలూరు: లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ సోమవారం పంపిణీ చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంఛన్ పంపిణీ చేశారు. పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం పింఛన్లు 17,922 ఉన్నాయి. వీరికి ప్రభుత్వం రూ.4.93 కోట్లు విడుదలయ్యాయి. పెనమలూరు మండలంలో 5555 మంది పింఛన్ దారులకు, తాడిగడప మున్సిపాలిటీలో 12,367 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొదటి రోజు దాదాపు 75 శాతం పింఛన్లు పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. పెనమలూరు సచివాలయం -1లో బట్టు రామానుజమ్మ (85) వృద్ధురాలికి వలంటీర్ ఆంగోతు కృప పింఛన్ అందజేసింది.

వర్షంలోనూ పింఛను పంపిణీ

ఉయ్యూరు: జోరు వర్షంలోనూ పింఛను పంపిణీ కొనసాగింది. మేడే సందర్భంగా వలంటీర్లు సోమవారం వేకువ ఝాము నుంచే పింఛను పంపిణీ చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి ఠంఛనుగా పింఛను అందించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పింఛను పంపిణీ ప్రక్రియను పరిశీలించి పలువురు లబ్ధిదారులకు సీఎం జగన్ బ్రోచర్‌తో కలిపి పింఛను సొమ్ము అందించారు. మున్సిపాలిటీలో తొలి రోజే 85 శాతం పింఛను పంపిణీ పూర్తయిందని కమిషనర్ తెలిపారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛను పంపిణీని గృహసారధులతో కలిసి చేపట్టారు.



పెనమలూరులో రామానుజమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కృప



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

గన్నవరం రూరల్: వలంటీర్‌ల సేవలకు ప్రశంసలు లభిస్తున్నాయి. మండలంలోని వీరపనేనిగూడెం గ్రామ సచివాలయంలో వలంటీగా పని చేస్తున్న నారగాని శంకర్ సోమవారం ఇద్దరికి ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేశాడు. తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పోలిమెట్ల కనక దుర్గకు, గన్నవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్రం రమణకు పింఛన్ అందజేశారు. వలంటీర్ శంకర్ సేవలను కార్యదర్శి బాపూజీ, సచివాలయం సిబ్బంది సంధ్యా దేవి, పలువురు గ్రామస్తులు అభినందించారు. పెన్షన్ లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న యేసు దివ్యకారుణ్యమూర్తి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరుగుతాయని విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎం.బాలజోసఫ్ ఆంథోని చెప్పారు. ఈ మేరకు సోమవారం విజయవాడ పాస్టోరల్ సెంట్రల్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ విజయరాజు బావను ముఖ్య అతిథిగా హాజరై మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అందరూ క్రీస్తు మార్గంలో నడవాలని సందేశమిచ్చారు.

కాలువ కట్టపై ఆలయ నిర్మాణం ఆపండి

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్న ఆలయ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని గుడివాడ డీఎల్‌పీవో పెనమలూరు పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు డీఎల్‌పీఓ సంపత్‌కుమారి ఉత్వర్వులు ఇస్తూ ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావును, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణను నివేదిక పంపాలన్నారు. పెనమలూరు వంతెన డౌన్‌లో గ్రామస్తులు బందరు కాలువ కట్టపై శ్రీకృష్ణదేవాలయం నిర్మించేందుకు సన్నహాలు చేయటంతో గ్రామానికి చెందిన బద్రి నానాయణ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ నిర్మాణం ఆపాలని, దీనిపై తగు చర్యలు తీసుకుని నివేదిక పంపాలని డీఎల్‌పీఓ ఆదేశించారు. ఆలయ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి, నీటిపారుదల శాఖ అధికారులకు సోమవారం లెటర్ పంపారు.

యువతకు ఆదర్శం కాశీనాథుని నాగేశ్వరరావు

గుడివాడ టౌన్: కాశీనాథుని నాగేశ్వరరావు చేసిన సేవా కార్యక్రమాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. సోమవారం స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో కాశీనాథుని నాగేశ్వరరావు 156వ జయంతి వేడుకలు జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మోహన్‌బాబు, డీఆర్‌బీ ప్రసాదు, ప్రవల్లిక, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చెన్న మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

ఎలకుర్రు(పామర్రు): ఎలకుర్రులోని చెన్న మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త కాశీనాథుడి నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఆలయంలో అంకురారోపణ, ధ్వజారోహణం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాలు జరిగాయి. మచిలీపట్నానికి చెందిన బాలాత్రిపుర సుందరి నృత్యనికేతన్ కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారులను ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు సత్కరించారు.

రేపు అవార్డుల ప్రదానోత్సవం

గ్రామంలోని భ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి కళావేదికలో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈనెల 3వ తేదీ రాత్రి 7 గంటలకు సభ జరుగుతుందన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతో సమాజాభివృద్ధి



కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో ఎంపీడీఓ స్వర్ణలత

పామర్రు(తోట్లవల్లూరు): మహిళల ఆర్థిక స్వావలంబనతో సమాజాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ స్వర్ణలత అన్నారు. యాకమూరులో సోమవారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంట్లో మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా విద్యావంతులయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మహిళల ఆర్థికాభ్యున్నతికి ఇటువంటి శిక్షణ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. తొలి విడతగా 30 మంది మహిళలకు కుట్టుమిషన్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. తొలుత శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ ప్రారంభించి కొద్ది సేపు మిషన్ కుట్టారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు చొప్పరపు వాణి, అంగన్‌వాడీ టీచర్ సువర్ణలత, క్లబ్ కార్యదర్శి, సభ్యులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని బంధువులకు అప్పగించిన పోలీసులు



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ జనార్ధన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇంటి నుంచి మాయమైన మూడేళ్ల చిన్నారిని హనుమాన్‌జంక్షన్ పోలీసులు పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాపులపాడు మండలం పెరికీడులోని శివాలయం సమీపంలో నివసిస్తున్న మద్దెల దుర్గ, చంటిబాబు ఇంటి వద్ద నుంచి దుర్గ తమ్ముడు గంగయ్య (3) సోమవారం సాయంత్రం మాయమయ్యాడు. ఇంటి చుట్టుపక్కల ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళనకు గురైన దుర్గ, అతని భర్త చంటిబాబు హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. బాలుడు మిస్సైన ప్రదేశం పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నప్పటికీ హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ రంగంలోకి దిగారు. బాలుడి బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు దంటగుంట్ల రోడ్డులో గంగయ్య ఏడుస్తూ కనపడ్డాడు. దీంతో బాలుడిని అక్క దుర్గ, బావ చంటిబాబులకు ఎస్ఐ జనార్దన్ అప్పగించారు. అతికొద్ది సమయంలో బాలుడిని పట్టుకుని అప్పగించటంపై పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. బాలుడు ఆడుకుంటూ వెళ్లి దారి తప్పి ఉంటాడని భావిస్తున్నారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలన



పెనమలూరులో వర్షానికి తడిసిన పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏవో శైలజ



ముస్తాబాదలో ధాన్యం కల్లాన్ని పరిశీలిస్తున్న ఏఓ తేజశ్వి

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో సోమవారం వ్యవసాయ శాఖ ఏడీ ఎం.సునీల్, మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మండల పరిధిలో పంట నష్టం జరిగిన పోరంకి, గంగూరు, పెనమలూరు ప్రాంతాల్లో సందర్శించారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ అకాలంగా కురిసిన వర్షం కారణంగా మొక్కజొన్న, జొన్న, వరి, పసుపు పంటలు సాగు చేసే రైతులకు నష్టం కలిగిందన్నారు. దీనిపై గ్రామాల్లో పర్యటించి పరిశీలించామన్నారు. గ్రామాల్లో ఉండే వ్యవసాయ సహాయకులతో పంట నష్టం వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. రైతులు కూడా తమకు జరిగిన నష్టం వివరాలు తెలపాలని సూచించారు. ప్రభుత్వం నుంచి సాయం అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. రైతులు తడిచిన పంటలు ఆరపెట్టుకోవాలని సూచించారు.

గన్నవరం రూరల్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజశ్వి పరిశీలించారు. మండలంలోని ముస్తాబాద గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న, వరి, కల్లాలపై ధాన్యాన్ని పరిశీలించి ప్రాథమికంగా నష్టం అంచనా వేశారు. మండలంలో వరి 50 ఎకరాలు, మొక్కజొన్న 45 ఎకరాలు, జొన్న 150, కల్లాల్లో ఉన్న ధాన్యం 500 ఎకరాలుగా అంచనా వేసినట్లు ఆమె చెప్పారు.

శాలివాహనుల సంక్షేమానికి సీఎం కృషి

శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి



మాట్లాడుతున్న శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం

ఉయ్యూరు: శాలివాహనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం అన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో పోటరీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గొట్టం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఔత్సాహికుల అవగాహన సదస్సు ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథి పురుషోత్తం మాట్లాడుతూ శాలివాహనుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.2.70 కోట్లు శాలివాహనులు తయారు చేసే వస్తువులకు రుణాలను అందిస్తుందన్నారు. శాలివాహన ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య, నాయకులు కొడాలి రవి, ఆళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. కాటూరు పోటరీ ఇండస్ట్రియల్ డెవలెప్మెంట్ సొసైటీ సభ్యులకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా రుణాలు తీసుకొచ్చి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



సత్యనారాయస్వామి వ్రతంలో భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రవధానుల సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో సాముహిక వ్రతాలు చేశారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (బాబు), మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతులు ఉచితం పూజా సామగ్రి అందించారు.

జగనన్న లేఅవుట్‌పై తప్పుడు ప్రచారం తగదు

భూములు ఇచ్చిన రైతులు

గన్నవరం: భూమిలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కేసరపల్లిలో జగనన్న లేఅవుట్‌కు భూములు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. గ్రామంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో భూములు ఇచ్చిన రైతులు జాస్తి విజయ భూషణ్‌కుమార్, అరవపల్లి బోస్, గారపాటి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ..ఐటీ పార్కు, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, హెచ్‌సీఎల్ తదితర సంస్థల ఏర్పాటుతో కేసరపల్లిలో భూములు ధరలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. అయినప్పటికి పేదలకు స్థలాల కోసం రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు రైతులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 73 ఎకరాలను తక్కువ ధరకు ప్రభుత్వానికి ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులు ఇచ్చిన జగనన్న లే ఆవుట్‌లో 2,836 మంది రైతులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. మొదటి ఫేజ్‌లో 1,056 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు కూడా చేస్తున్నారని వివరించారు. ఇటీవల కాలనీని సందర్శించిన జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జగనన్న కాలనీలో జరుగుతున్న పనులు, గృహ నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. అయితే కొంత మంది వ్యక్తులు జగనన్న కాలనీపై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కాలనీలో హైటెన్షన్ స్తంభాలు ఉన్న ప్రాంతాన్ని సామాజిక అవసరాల నిమిత్తం వినియోగించేందుకు ఐఏఎస్ స్థాయి అధికారుల నిర్ణయం మేరకు తీసుకున్నట్లు చెప్పారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం తవ్విన గుంతను ప్రభుత్వ చెరువుగా తప్పుడు ప్రచారం చేయడం సరికాదని రైతు బోస్ తెలిపారు. అవినీతికి తావులేకుండా ప్రభుత్వం పారదర్శకంగా సేకరించిన భూములపై అవాస్తవాలను ప్రచారం చేయడం తగదని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు హితవు పలికారు.